AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com
17-9-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

ఘనంగా ప్రజాపాలన సంబరాలు..



2



2

నగరంలో నడిరోడ్డుపై దారుణ హత్య..

## ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్ల గడువు అక్టోబర్ 10

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లాలో ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్ల గడువు అక్టోబర్ 10తో ముగియనుందని డీఈవో అశోక్ తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ఇన్‌స్పైర్ అవార్డ్స్ నామినేషన్ సెప్టెంబర్ 15 చివరి తేదీగా గతంలో నిర్ణయించారన్నారు. అయితే అక్టోబర్ 10వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. కాబట్టి ప్రభుత్వ, జిల్లా పరిషత్ కేజీబీవీ మోడల్ స్కూల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, అప్పర్ ప్రైమరీ, హై స్కూల్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ప్రత్యేకంగా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ఐదు నామినేషన్లను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి కే గంగా కిషన్‌ను సంప్రదించాలని తెలియజేశారు.



## నవ భారత నిర్మాత ప్రధాని నరేంద్ర మోదీ

**అక్షరటుడే, ఇందూరు:** నవభారత నిర్మాత, దేశ ప్రగతి దార్శనికులు ప్రధాని నరేంద్ర మోదీ అని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని నగరంలోని గంగస్థాన్‌లో గల స్నేహ సొసైటీలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 13ఏళ్లుగా సీఎంగా, 12 ఏళ్లు ప్రధానిగా సేవలందిస్తూ దేశాన్ని ప్రగతి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. ప్రపంచంలోనే దేశాన్ని విశ్వ గురువుగా నిలబెడుతున్నారని కొనియాడారు. అన్నివర్గాల ప్రజలకు సమ న్యాయం చేస్తూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందని, ప్రధాని మోదీ పుట్టిన రోజుతో పాటు తెలంగాణ విమోచన దినం, విశ్వ కర్మ జయంతి కూడా ఉందని గుర్తుచేశారు. నిజాం రాచరిక పాలన నుంచి విముక్తి పొందిన రోజన్నారు. ప్రధాని పుట్టిన రోజును పురస్కరించుకొని స్నేహ సొసైటీ లోని విద్యార్థులతో కలిసి వేడుకలు నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ, నాయకులు మారావార్ కృష్ణ, బాబీ సింగ్ తదితరులు పాల్గొన్నారు.





కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్) షిఫ్టింగ్ వ్యవహారం అటకెక్కింది. రోజురోజుకూ రోగుల సంఖ్య పెరుగుతుండటంతో ప్రస్తుత భవనం సరిపోవడం లేదు. పురాతన భవనం కావడంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. దీంతో ఆస్పత్రిని తరలించాలని తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి

# జీజీహెచ్ షిఫ్టింగ్ లేనట్టేనా..?

- ఆస్పత్రిని మెడికల్ కళాశాలలోకి తరలించాలని నిర్ణయం
- తాగునీరు, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో వెనకడుగు
- వసతుల కల్పన కోసం వెయిటింగ్
- ప్రస్తుత భవనంలో వసతులు లేక రోగుల ఇబ్బందులు

పట్టణంలోని జీజీహెచ్ ప్రస్తుతం 330 పడకలతో కొనసాగుతోంది. జిల్లా ఏర్పాటు తర్వాత ఓపీ, ఐపీ సంఖ్య రెట్టింపైంది. రోజుకు 800 నుంచి 1000 మంది వరకు ఓపీకి వస్తున్నారు. గతంలో ఉన్న పాత భవనంపైనే మరొక అంతస్తు నిర్మించి సర్దుబాటు చేస్తున్నారు. అయినా వార్డులు సరిపోవడం లేదు. ఆస్పత్రి ఆవరణ అత్యంత ఇరుకుగా ఉండటంతో అంబులెన్సులు, 108 వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. పార్కింగ్ స్థలం లేకపోవడంతో ప్రధాన రోడ్డుపైనే వాహనాలు నిలపాల్సి వస్తోంది.

### మెడికల్ కళాశాలకు తరలించాలని నిర్ణయం

ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలకు శాశ్వత పరిష్కారంగా జీజీహెచ్‌ను దేవునిపల్లి శివారులో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనంలోకి తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అక్కడ విశాలమైన భవనం, 350 పడకలకు సరిపడా వసతి, ఆధునిక ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయి. మెడికల్ కళాశాలతో అనుసంధానిస్తే బోధనతో పాటు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అధికారులు భావించారు.

### రోడ్డు సౌకర్యం లేకపోవడంతో..

ఆచరణలోకి వచ్చేసరికి మౌలిక వసతుల కొరత అడ్డంకిగా మారింది. మెడికల్ కళాశాల ప్రాంగణంలో తాగునీటి సౌకర్యం ఇంకా పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదు. మిషన్ భగీరథ లైన్ కనెక్షన్ పెండింగ్‌లో ఉంది. అక్కడికి వెళ్లే ప్రధాన రోడ్డు అధ్వానంగా ఉంది. వర్షం వస్తే బురదమయంగా మారుతోంది. రాత్రి వేళల్లో వీధి దీపాలు కూడా లేవు. అత్యవసర సమయంలో గర్భిణులు, వృద్ధులు ఆస్పత్రికి చేరుకోవడం కష్టమవుతుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో పేద రోగులు ఆటోలపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో షిఫ్టింగ్ పై అధికారులు వెనకడుగు వేశారు.

### పనులు చేపట్టాకే..

వసతుల కల్పన తర్వాతే షిఫ్టింగ్ చేపడతామని జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు. తాగునీరు, నిరంతర విద్యుత్, డబుల్ రోడ్డు, బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించాలని ఇప్పటికే ప్రభుత్వానికి, సంబంధిత శాఖలకు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు తెలుస్తోంది.



## ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

**అక్షరటుడే,ఎల్లారెడ్డి :** నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పక్కాగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. 'సార్‌తో సర్పంచ్ సాబ్' కార్యక్రమాన్ని మద్నూర్ మండల కేంద్రంలో నిర్వహించగా ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. గ్రామస్తులను స్వయంగా కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, గ్రామ సర్పంచ్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవం

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీఛైర్మన్ విఠల్ రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు బాజిరెడ్డి జగన్, సత్యప్రకాశ్, సుజిత్ సింగ్ ఠాకూర్ పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ హయాంలోనే తండాల అభివృద్ధి

**అక్షరటుడే, కామారెడ్డి :** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే తండాల అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. గిరిజనులకు 6 నుంచి 10 శాతం రిజర్వేషన్ పెంచిన రోజు సందర్భంగా గురువారం రామారెడ్డి మండలం జగదాంబ తండాలో మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. గిరిజనుల అభివృద్ధి కోసం కేసీఆర్ కృషి చేశారన్నారు. 6 శాతం ఉన్న గిరిజన రిజర్వేషన్లను 10 శాతానికి పెంచిన ఘనత కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రిజర్వేషన్లు పెరగడంతో అనేక మంది గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయన్నారు. తండాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలన్న ఉద్దేశంతో 500 జనాభా ఉన్న తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చి తండాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజనులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోడు భూములను గిరిజనులకు



సాగు కోసం ఇస్తే ఈ ప్రభుత్వం అధికారులను ఉసిగొల్పి గిరిజనులపై దాడులు చేయిస్తోందని ఆరోపించారు. గిరిజనుల జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మళ్ళీ తండాల అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుక్యా లతబాయి నంద, ఉప సర్పంచ్ రాజు నాయక్, స్కూల్ తండా సర్పంచ్ సలావత్ బుచ్చిరెడ్డి, బట్టు తండా ఉప సర్పంచ్ కిషోర్, మినుకూరి రాంరెడ్డి, దశరథ్ రెడ్డి, రాజాగౌడ్, రాంరెడ్డి, చంద్రు నాయక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్జీవోస్ కార్యాలయంలో ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ జెండా ఎగురవేశారు. టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సతీష్, జిల్లా కోశాధికారి నీరంజన్ గౌడ్, ఉపాధ్యక్షుడు సంజీవయ్య, జాఫర్ హుస్సేన్, అర్బన్ యూనిట్ కార్యదర్శి మారుతి, స్వామి, రాజేశ్వర్, వనమాల సుధాకర్, క్లాస్ ఫోర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు.



## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన దినోత్సవం

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య జాతీయ జెండా ఎగురవేశారు. అనంతరం పోలీస్ లైన్ ప్రభుత్వ స్కూల్ విద్యార్థులకు స్వీట్ ప్యాకెట్లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు డీసీపీ (అడ్మిన్)శుభం ప్రకాష్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, ఏఆర్ ఏసీపీ కృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సీఐలు, ఆర్ఐలు, ఎస్సైలు జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది, ఐటీ కోర్ తదితరులు పాల్గొన్నారు.



## రాచరిక వ్యవస్థ నుంచి విముక్తి పొంది ప్రజాపాలనలోకి..

**అక్షరటుడే, కామారెడ్డి :** తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా నిరంకుశ పాలన అంతమై 17 సెప్టెంబర్ 1948న ప్రజాపాలనలోకి వచ్చిందని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నేరేళ్ల శారద అన్నారు. బుధవారం కామారెడ్డిలో జరిగిన తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలు చేయడం ప్రారంభించిందని తెలిపారు. జిల్లాలో ఈ వానాకాలం సీజన్‌లో 5,53,437 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారని, ఇందిరమ్మ రైతు భరోసా కింద 3,6,890 మంది రైతుల ఖాతాల్లో రూ.305.72 కోట్లు జమ చేశామన్నారు. 50 శాతం రాయితీపై విత్తనాలు, 100 శాతం రాయితీపై సోయా విత్తనాలు అందించామని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగులో 13 వేల ఎకరాల లక్ష్యంలో 1,233 ఎకరాలకు అనుమతి ఇచ్చి 453 ఎకరాల్లో మొక్కలు నాటడం పూర్తి చేశామని తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకు అనుసంధానం ద్వారా రూ.328.70 కోట్లు, పట్టణ సంఘాలకు రూ.42కోట్లు రుణ సహాయం అందించామన్నారు. వడ్డీ లేని రుణాల కింద మహిళలకు రూ.273 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. వన





మహోత్సవంలో 22.39 లక్షల మొక్కలు నాటామని, గృహజ్యోతి కింద 1,75,306 మందికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల కింద 3,612 ఇళ్లు మంజూరు చేసి 11,964 ఇళ్ల నిర్మాణం ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర, గ్రంథాలయ ఛైర్మన్ చంద్రకాంత్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి, డీఎఫ్‌వో నీరజ్ కుమార్, అడిషనల్ కలెక్టర్లు గిరి, విక్టర్, అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## సుస్థిర పాలనతో ముందుకెళ్తున్నాం: ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్రంలో సుస్థిర పాలనతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. తెలంగాణ సాయుధ పోరాట ఫలితంగా అప్పటి వరకు పల్లెలలో నెలకొన్న వెట్టి చాకిరీ, భావ వ్యక్తీకరణపై ఆంక్షలు, మాతృ భాష అణిచివేత, మతపరమైన నిరంకుశ ధోరణులు పోయి 17 సెప్టెంబర్ 1948న హైదరాబాద్ సంస్థానం రాచరిక వ్యవస్థ నుండి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చిందన్నారు. నేడు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమలకు స్వర్గధామంగా పేరొందిందన్నారు. జిల్లాలో రైతు భరోసా, మహాలక్ష్మి, గృహ జ్యోతి, చేయూత పథకం, రైతు ఋణ మాఫీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం సజావుగా జరుగుతున్నందుకు ఆనందం వ్యక్తం చేస్తున్నామన్నారు. సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల అమలులో నిజామాబాద్ జిల్లా ముందంజలో పయనిస్తూ అందరికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రైతు భరోసా పథకం ద్వారా వానాకాలం సీజనుకు గాను జిల్లాలో 2,75,000 మంది రైతులకు ఇప్పటి వరకు రూ.316 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాలలో జమ చేశామన్నారు. ఖరీఫ్ సీజన్‌కు గాను 736



కొనుగోలు కేంద్రాల ద్వారా 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అంచనా వేశామన్నారు. అక్టోబర్ 1 నుంచి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో మొదటి దశ కింద 17,151 ఇళ్లు మంజూరు చేశామన్నారు. అందులో 10,071 పూర్తయ్యాయన్నారు. మిగిలిన 7,800 ఇళ్లు పురోగతిలో ఉన్నాయన్నారు. రెండోదశలో ప్రతి నియోజకవర్గానికి 2 వేల ఇళ్లు కేటాయించామని చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 10 కోట్ల 38 లక్షల మంది మహిళా ప్రయాణీకులు ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, సీపీ సాయిచైతన్య పాల్గొన్నారు.





నగరంలోని కాంగ్రెస్ భవన్‌లో..


నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో..


ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో



## ఘనంగా ప్రజాపాలన సంబరాలు..

ఉమ్మడి జిల్లాలో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో అధికారులు జాతీయ జెండాలను ఎగురవేశారు. నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తి పొందిన రోజును ప్రభుత్వం ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించగా.. బీర్ఎస్ నాయకులు జాతీయ సమైక్యత దినోత్సవాంగా నిర్వహించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్


జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రాజేష్ చంద్ర


ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవం


తెలంగాణ యూనివర్సిటీలో ..


భీమ్‌గల్ మున్సిపాలిటీలో..


ఆర్మూర్ ఎంవీఐ కార్యాలయంలో..

## ఘన్‌పూర్–డిచ్‌పల్లి స్టేషన్ రోడ్డుపై రాకపోకలు బంద్

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డబ్లింగ్ పనుల్లో భాగంగా డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ సమీపంలోని ఎల్‌సీ గేట్ నంబర్ 196ను తాత్కాలికంగా మూసివేయనున్నారు. దీంతో సెప్టెంబర్ 22 ఉదయం 8 గంటల నుంచి సెప్టెంబర్ 24 ఉదయం 8 గంటల వరకు ఆ మార్గంలో రాకపోకలు నిలిపి వేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. వాహనదారులు, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని అధికారులు కోరారు. రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులో భాగంగా ముద్‌ఖేడ్-మేడ్చల్ మార్గంలో వంతెనలు, ఆర్‌యూబీలు, విద్యు, సిగ్నలింగ్ తదితర పనులు కొనసాగుతున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.



## చేయూత పింఛన్ దరఖాస్తుల పరిశీలన

**అక్షరటుడే, ముప్కాల్:** చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పెన్షన్ స్పెషల్ ఆఫీసర్ సాజియా అఫ్రిన్ ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదైన దరఖాస్తుదారుల వివరాలను సేకరించి ప్రక్రియను పూర్తి చేశారు. కార్యక్రమం కొనసాగుతున్న తీరును ఎంపీడీవో బి.రమేష్ పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. సర్పంచ్ బర్కం గంగాధర్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి విజ్ఞేష్, ఫీల్డ్ అసిస్టెంట్ భూమేశ్వర్ పాల్గొన్నారు.

## కామారెడ్డిలో పోలీసుల ఆధ్వర్యంలో అన్నదానం



**అక్షరటుడే, కామారెడ్డి:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ రాజేష్ చంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఎస్పీ అన్నదాన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఎస్పీ స్వయంగా భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. అనంతరం పోలీస్ అధికారులు, ప్రజలు, గణేష్ ఉత్సవ నిర్వాహకులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి, సిబ్బందితో కలిసి భోజనం చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, ఇక్కడి ప్రజలలో ఉండే ఆత్మీయత, పరస్పర సహకారం, ఐకమత్యం జిల్లా ప్రత్యేకతకు అద్దం పడతాయన్నారు. జిల్లా ప్రజలందరూ గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, సోదరభావంతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి డీఎస్పీ మధుసూదన్, పట్టణ సీఐ నరహరి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



**అక్షరటుడే కోటగిరి :** మండలంలోని సుద్దుల తండా నూతన గ్రామపంచాయతీలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంతు సేవాలాల్ మహారాజ్, రామారావు మహారావ్ మాజీ సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు తెల్ల రవికుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ హయాంలోనే గిరిజన తండాలు గ్రామపంచాయతీలుగా మారాయని తెలిపారు. అలాగే గిరిజనులకు రాజ్యాధికారం కల్పించడంతో పాటు, గిరిజనులకు బీఆర్ఎస్ హయాంలోని న్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏ గిరిజన కుటుంబానికి కూడా న్యాయం చేయలేదన్నారు. గిరిజనులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు మోరే కిషన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ కప్పు సంతోష్, అజ్మీర, కిషన్ నాయక్, ఉప సర్పంచ్ శంకర్, భగవాన్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

## గుండ్ల చెరువు వద్ద గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**అక్షరటుడే, ఆర్మూర్:** వినాయక నిమజ్జనాల నేపథ్యంలో ఆర్మూర్ పట్టణంలోని గుండ్ల చెరువు వద్ద ఏర్పాట్లను సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, వివిధ శాఖల అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. నిమజ్జనం కోసం ప్రత్యేకంగా క్రేన్లు ఏర్పాటు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు, సీసీ కెమెరాలతో నిఘా, పోలీస్ బందోబస్తు పారిశుధ్యం, తాగునీటి వసతి, ట్రాఫిక్ మళ్లింపు చర్యలపై ఆరా తీశారు. నిమజ్జనం రోజు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరకుండా చూడాలన్నారు. గజ ఈతగాళ్ల బృందం, వైద్య బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, తహశీల్దార్ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు ఆంజనేయులు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.







## బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. 1948 సెప్టెంబర్ 17న నిజాం కబంధ హస్తాల నుంచి, రజాకార్ల అరాచకాల నుంచి అప్పటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జరిపిన 'ఆపరేషన్ పోలో' (సైనిక చర్య) ద్వారా హైదరాబాద్ సంస్థానానికి విముక్తి లభించిందని నాయకులు పేర్కొన్నారు.

– అక్షరటుడే, నెట్‌వర్క్

## నల్లూర్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ



**అక్షరటుడే, ముప్కాల్:** నల్లూర్ గ్రామంలో గురువారం స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ బర్కం గంగాధర్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఏడాదికి 100 గంటలు, అంటే వారానికి రెండు గంటలు స్వచ్ఛత కోసం స్వచ్ఛందంగా కేటాయిస్తామని ప్రతిజ్ఞ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కార్యక్రమ నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి విజ్ఞేష్, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ



**అక్షరటుడే,నందిపేట్:** మోదీ జన్మదినోత్సవం పురస్కరించుకొని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నందిపేట జెడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో పదోతరగతి విద్యార్థులకు పెన్నులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. మండల నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యలో రాణించి దేశాభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. అలాగే మోదీ జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. అనంతరం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక నందిపేట మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద వద్ద జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నగరంలో నడిరోడ్డుపై దారుణ హత్య..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. రాజారాజేంద్ర చౌరస్తా వద్ద మల్టీఫ్లెక్స్ థియేటర్ సమీపంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు థియేటర్ సమీపంలో కూరగాయలు అమ్మే ప్రాంతానికి వచ్చారు. అక్కడ హరిబాబు అనే వ్యక్తిని తమతో తెచ్చుకున్న కొబ్బరికాయలు కోసే కత్తితో నరికారు. దీంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రెండో టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురికి తరలించారు. ఏసీపీ ప్రకాశ్ సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. హత్య గురైన హరిబాబు ప్రముఖ యూట్యూబర్ వైష్ణవి భర్త అని గుర్తించారు. హరిబాబు గతంలో తన భార్య వైష్ణవిని హత్య చేశాడు.ఈ కక్షతోనే హరిబాబును హత్య చేసినట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేస్తున్నారు.


లింగంపేటలో..


ఐలాపూర్ లో..

## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

జిల్లావ్యాప్తంగా గురువారం విశ్వకర్మ జయంతిని విశ్వబ్రాహ్మణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డిలోని దేవివిహార్ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ భగవాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింగంపేట మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణులు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించగా, మోతే, భవానీపేట గ్రామాల్లో యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అన్న ప్రసాదం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వడ్ల భీమయ్య, హన్మాండ్లు, రామచందర్, వెంకన్న, పండరి, నరహరి, బసవయ్య, రామానంద్, రవికుమార్, లింగంపేట విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు సిద్ధిరాములు, ప్రభాకర్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. - అక్షరటుడే, లింగంపేట


భవాని పేటలో..


లింగంపేటలో బైక్ ర్యాలీ..